# సెంటిమెంట్

ఆటో ఆగింది. చైతన్య బ్రీఫ్‌కేస్‌తో ఆటోలోంచి దిగాడు. అతని మొహంలో అలసట. విషాదం గూడు కట్టుకున్నట్టుగా ఉంది. అతని కళ్ళు దేనికోసమో అన్వేషిస్తున్నట్టు చంచలంగా కదుల్తున్నాయి. అతని వెనకాలే మధు కూడా ఆటోలోంచి దిగి జేబులోంచి పర్స్ తీసి మీటర్ చూసి డబ్బులిచ్చాడు. దిగిన చోటే నిలబడి అయోమయంగా దిక్కులు చూస్తున్న చైతన్య భుజం మీద చేయివేశాడు. చైతన్య మధు వైపు చూశాడు. కాంతి విహీనంగా ఉన్న ఆకళ్ళలో ఎన్నో ఎన్నెన్నో భావాలు మరెన్నో ప్రశ్నలు. ''లోపలికి పద చైతన్యా!'' మృదువుగా అన్నాడు మధు. చైతన్య రహితంగా లోపలికి నడిచాడు చైతన్య.

హాలంతా నిశ్శబ్దంగా ఉంది ఆ నిశ్శబ్దంలో దైన్యం ఉంది. ఆ దైన్యంలో ఆవేదన ఉంది. గోడకి వ్రేళ్లాడుతున్న వెంకటేశ్వరస్వామి నిలువెత్తు పటానికి కొంచెం ఎడంగా మరో ఫోటో, ఆ ఫోటోకి వ్రేళ్లాడుతున్న గులాబీల దండ . సగం వెలుగుతూ బూడిద రాలుస్తున్న అగర్‌బత్తిలు ఆ పరిమళం ఎలాగో ఉంది. ఆవిషాదం తనది కాదన్నట్టుగా గర్వంగా నవ్వుతోంది దమయంతి. చైతన్య గుండె ముక్కలు ముక్కలుగా విరిగిపోతున్న భావన. లోపలి నుంచి సన్నగా వెక్కిళ్ళ శబ్దం. ''కవిత వచ్చి నాలుగు రోజులైంది''. ఓ క్షణం మౌనం తరువాత అడిగాడు చైతన్య, ''అప్పుడు అమ్మ దగ్గరే ఉందా?'' ''ఆఖరి శ్వాస తీసుకున్న మరుక్షణం వచ్చింది''

చైతన్య బరువుగా అడుగులేస్తూ బెడ్‌రూమ్ సమీపించాడు. మంచం మీద నిశ్చలంగా పడుకుని సీలింగ్ కేసి చూస్తున్నాడు శ్రీధర్‌మూర్తి. గుమ్మం దాటి లోపలకు అడుగుపెట్టిన చైతన్య కంఠం పెగుల్చుకుని పిలిచాడు. 'నాన్నా'... కొన్ని క్షణాల నిశ్శబ్దం తరువాత ఆయన కళ్ళు తిప్పి చైతన్యని చూశాడు. గాజు గోళాల్లా ఉన్న ఆకళ్ళల్లో జీవం లేదు. చైతన్య ఆయనను సమీపించి, మంచం మీద చివరికి కూర్చుని ఆయన తలమీద చేయివేశాడు. అతనిగుండె బరువుగా అనిపిస్తోంది.

సరిగ్గా రెండేళ్ళ క్రితం కళ్ళు నిండా నీళ్ళతో అన్నది దమయంతి. ''జాగ్రత్తగా వెళ్ళు నాన్నా! మధ్య మధ్య ఉత్తరాలు రాస్తుండు- బద్ధకించకు, ఒక వేళ- ఒక వేళ ఈ మధ్యలో మాకేదన్నా అయితే చివరిక్షణానికైనా ఓసారి వచ్చి వెళ్ళు''. కొంచెం చిరాకు మరికొంత అనునయం జోడించి అన్నాడు చైతన్య. ''ఏవిటమ్మా ఇది? సెంటిమెంట్స్‌తో మమ్మల్ని కట్టేస్తే ఎలా? మీ ఆప్యాయత, అనురాగం మా భవిష్యత్తుకు ఆటంకం కాకూడదమ్మా దీవించి పంపు''.

''దీవిస్తానురా కానీ తల్లిని కదా! నిన్ను విడిచి ఉండలేని వేదన. నువ్వు ఎంతో వృద్ధిలోకి వస్తున్నావన్న ఆనందం రెండూ కలిసి కన్నీళ్ళు వస్తున్నాయి'. కళ్ళు తుడుచుకుని, తలమీద చేయి వేసి దీవించింది.

''ఆవిడ అనుభూతులను మనం కంట్రోల్‌చేయలేం కదా!'' అన్నాడు శ్రీధరమూర్తి. చైతన్య గుండెల్ని చీల్చుకుంటూ వచ్చిందో నిట్టూర్పు. 'చైతన్యా వెళ్ళు వెళ్ళి స్నానం చేసిరా ప్రయాణపు బడలిక తీరుతుంది'. ఆ విషాదభరిత వాతావరణం తట్టుకోలేని మధు మృదువుగా అన్నాడు. చైతన్య మంచం మీద నుండి లేచి హాల్లోకి నడిచాడు. 'అన్నయ్యా!' కవిత ఉప్పొంగుతున్న కన్నీటి సంద్రంలా వచ్చి అతణ్ణల్లుకుపోయింది. 'ఊరుకో కవితా! ఉయ్ ఆర్ హెల్ప్‌లెస్' కవిత ఊరుకోలేదు. అలా వెక్కి వెక్కి ఏడుస్తూనే ఉంది. 'కవితా! ఏవిటిది? ఇలారా' మధు ఆమెని భుజాలు పట్టి చైతన్య నుంచి విడదీశాడు. 'చిన్న పిల్లవా? వెళ్ళు. మొహం కడుక్కురా, అటు చూడు మలయ ఎలా చూస్తోందో బిక్కచచ్చిపోయి' చైతన్య తలతిప్పిచూశాడు. గుమ్మంలో నుంచుని బెలగా చూస్తోంది. మూడేళ్ళ పాప, మధువైపు ప్రశ్నార్థకంగా చూశాడు. 'గుర్తు పట్టలేదా? మలయ... మలయా! ఇలారా బాబాయికి నమస్తే చెప్పు' నవ్వుతూ పిల్చాడు మధు. 'మలయా! నేను వెళ్లేటప్పుడు ఏడాదిపాప. పెద్దదైంది. రామ్మా' పిల్చాడు చైతన్య. మలయ అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చింది. చైతన్య ఆపాప నెత్తుకుని 'స్కూల్ కెళ్తున్నావా?' అడిగాడు. 'వెళ్తున్నా' ముద్దుగా చెప్పింది. 'గుడ్' కిందికి దించేసి బాత్రూం వైపు వెళ్లాడు.

'అత్త దగ్గరికెళ్ళు' మలయ చేయిపట్టుకుని కవిత దగ్గరకి తీసుకొచ్చాడు మధు. 'అత్తా! దా!' కవిత చీర చెంగు పట్టి లాగింది మలయ. 'నీకు రెణ్ణెళ్ల

నుంచి ఫోన్ చేస్తూనే ఉన్నా కదా ఓసారి వచ్చి వెళ్ళమని, పనులు, చదువు, పరీక్షలు అంటూ దాటేశావు. గడచిన కాలం వెనక్కిరాదు చైతన్యా! కావ్య కొంచెం నిరసనగా అన్నది.

'కావ్యా'! మందలింపుగా పిల్చాడు మధు.

'అననీరా! ఒక్కళ్ళున్నా నన్ను తిట్టడానికి ముందుకొచ్చారు. నన్ను తిట్టాలి. హింసించాలి. అప్పుడైనా రెండు కన్నీటి చుక్కలు నా కళ్ళల్లోంచి రాలతాయి. ఎందుకో తెలీడంలేదు. కన్నీరే రావడంలేదు ఈ గుండెబరువు తగ్గడం లేదు' చైతన్య కుమిలిపోతున్నాడు.

'కన్నీళ్ళు కళ్ళలో ఉండవు. చైతన్యా అవి గుండెల్లో ఉంటాయి, మంచులా గడ్డకట్టుకుని ఉంటాయి. మనసు పొరలని వెచ్చగా తాకే అనుభూతి ఉన్నప్పుడే అవి కరిగి నీరై ప్రవిస్తాయి కళ్ళగుండా'.

చైతన్య దెబ్బతిన్నట్టుగా చూశాడు. 'అంటే... అంటే నాకేం అనుభూతులు లేవంటావా కావ్యా! అమ్మ మరణం నాలో ఏ దుఃఖాన్ని, బాధనీ కలిగించలేదంటావా?'

'చైతన్యా! కావ్య కోపం మీద అంటుంది. పట్టించుకోకు, కావ్యా! పనిచూసుకో' మధు కొంచెం కోపంగా అన్నాడు.

కావ్య విసురుగా అక్కణ్ణించి వెళ్ళిపోయింది. ఆమె అన్నమాటలు చైతన్య గుండెల్లో శూలాల్లా తగిలాయి. కవిత వరద గోదారిలా ఉంది. ఏడ్చి, ఏడ్చి కళ్ళు ఉబ్బాయి. మొహం అంతా విషాదం మూర్తీభవించినట్టుంది. కానీ తన కళ్ళనుండి ఒక్క చుక్కైనా రాలదేం. తన మనసు అనుభూతికి అతీతమైపోయిందా? లేక తనలో కన్నీళ్ళు ఇంకిపోయాయా? రెండురోజులు అలా భారంగా, విషాదంగా గడిచిపోయాయి. ఆరోజుకి దమయంతి చనిపోయి ఆరు రోజులు. శ్రీధరమూర్తి చైతన్యతో అసలు మాట్లాడలేదు. కవిత ఏడుస్తూనే ఉంది. తలుచుకుని, తలుచుకుని. మధు ఒక్కడే కొంచెం ఆప్యాయంగా మాట్లాడుతున్నాడు. మలయ లేకపోయుంటే ఆ ఇంట్లో స్మశాన నిశ్శబ్దం ఆవరించి ఉండేది.

చైతన్య హాల్లో సోఫాలో కూర్చుని ఉన్నాడు. కవిత అక్కడే క్రింద కూర్చుని తలపైకెత్తి దమయంతి ఫోటోకేసి చూస్తోంది. కావ్య వెలిగించిన దీపం దమయంతి ఆత్మ జ్యోతిలా ప్రకాశిస్తోంది. మధు మలయుని ఒళ్లో కూర్చోబెట్టుకుని పలకమీద అక్షరాలు దిద్దిస్తున్నాడు. శ్రీధరమూర్తి బెడ్రూంలో మంచం మీద పడుకుని ఉన్నాడు. చైతన్య కవితను చూసి అడిగాడు. 'బావగారు రాలేదేం కవితా'. కవిత తలతిప్పి చూసింది. ''ఆ ఒక్కరోజు వచ్చి వెళ్లారన్నయ్యా. మళ్లీ పదో రోజు వస్తాన్నారు''.

''ఆ రోజొచ్చి తీసుకెళ్తానన్నారా నిన్ను''

''కాదన్నయ్యా! కర్మకాండ జరిపించేటప్పుడు ఉండాలిగా ఆయన కూడా''

''కర్మకాండ! అంటే ఆ ఆచారాలు అదంతా పాటించాలా?''

అయోమయంగా చూశాడు చైతన్య.

మధుతలెత్తి చూశాడు. 'ఆచారాలు, సంప్రదాయాలు కొన్ని సందర్భాల్లో పాటించక తప్పదు చైతన్యా'.

చైతన్య అయిష్టంగా చూశాడు. ''నాకెందుకో అలాంటివన్ని ఇష్టంలేదు మధూ! ఈ శాస్త్రాలమీద నాకు నమ్మకం లేదు.''

''నీ నమ్మకాలతో పనిలేదు చైతన్యా! మనది భారతదేశం. కొన్ని సంప్రదాయాలు మనకి ఉన్నాయి. వాటిని అనుసరించాల్సిన బాధ్యత మనకుంది'' కావ్య ఎప్పుడు విన్నదో మధు ప్రక్కగా కూర్చుంటూ అన్నది.

'కానీ, కావ్యా, ఈ ఆచారాలు, శాస్త్రాలు, మూఢనమ్మకాలు--'',

'చైతన్యా! నీలో నీ సిద్ధాంతాలపట్ల నమ్మకం కన్నా అది ఎలాగైనా అమలు పరచాలన్న మొండితనం కనిపిస్తుంది. ఆ మొండితనంతోటే మీ అమ్మగారు తన అయిష్టాన్ని కన్నీటి రూపంలో వ్యక్తం చేస్తే సెంటిమెంట్ అంటూ కొట్టి పారేసి ఇండియా వదిలి వెళ్ళిపోయావు. అక్కడేవో గనులున్నాయి. అవన్నీ త్రవ్వి ఆ బంగారం, వజ్రాలు సంపాదించి ఓ రాత్రిలో కోటీశ్వరుడివై పోవాలనుకున్నావు. మరి ఎంత సంపాదించావో!'' హేళనగా అడిగింది కావ్య.

''కావ్యా! ఎందుకలా వచ్చిన దగ్గర్నుంచీ వాణ్ణలా నీ మాటలతో చిత్రహింస పెడతావు? సారీ చైతన్యా! కావ్య ఆవేశంతో ఏదో అంటోంది. పట్టించుకోకు, నిన్ననే అధికారం హక్కు తనకేమున్నాయి' మధు క్షమాపణగా అన్నాడు.

'మధూ!' బాధగా చూశాడు చైతన్య. ''నేనలా అన్నానా? నువ్వు, కావ్య పరాయివాళ్ళని నేనేకాదు ఈ ఇంట్లో ఎవరూ భావించలేదు. ఇంకా మాట్లడితే ఇప్పుడు నేనే పరాయివాణ్ణి. నువ్వే స్వంత కొడుకువి''.

''చైతన్యా! ప్లీజ్ అలాంటి మాటలనకు, అనాధనైన నన్ను చేరదీసి కన్న తల్లిలా ఆదరించి నన్నింతవాణ్ణి చేసిన అమ్మ ఋణం ఆవిడకి తలకొరివి పెట్టి తీర్చుకున్నాననుకుంటున్నాను-- భగవంతుడు నాకీ అవకాశం ఇవ్వడం నా అదృష్టంగా భావిస్తున్నాను''.

చైతన్య మనసు కలుక్కుమంది. ''నేను మాత్రం ఆవిడ ఋణం తీర్చుకునే అవకాశం ఇంకెన్నటికీ పొందలేను. నిజానికి నేను సంపాదించాలనుకున్నది అమ్మకోసం, నాన్నకోసం, చిన్నప్పట్నించీ నాన్న సంపాదన. ఈ ఇంటి ఆర్థిక పరిస్థితి కళ్ళారా చూశాను కనక ఇంకెప్పుడూ అలాంటి బాధలు అమ్మానాన్న కానీ, నేను కానీ పడకూడదనుకున్నాను. వాళ్ళని సుఖపెట్టాలని, కార్లలో తిప్పాలని తహతహలాడాను.''

కొంత విరామం తర్వాత మధు చైతన్యవైపు తిరిగి కొంచెం అనునయంగా అన్నాడు. 'చైతన్యా! మనకి నమ్మకాలు ఉన్నాయా! లేదా! అనేది ఇక్కడ అప్రస్తుతం. అమ్మకి ఈ ఆచారాల పట్ల నమ్మకం, గౌరవం ఉన్నాయి. ఆవిడ నమ్మకాన్ని గౌరవించాల్సిన బాధ్యత నీకుంది. ఆవిడ మీద నీకేదయినా అభిమానం మిగిలి ఉంటే నీకిష్టం ఉన్నాలేకపోయినా నువ్వు ఈ కర్మకాండ జరిపించాలి''.

''అమ్మ మీద నాకు ప్రేమాభిమానాలున్నాయని రుజువు చేసుకోవాలంటే ఇదేనా మార్గం?''

''ప్రస్తుతం నీకున్న అవకాశం ఇదేరా చైతన్యా! అమ్మ అనాథ కాదు కదా! ఆవిడ పేగు తెంచుకుని పుట్టిన పిల్లలు మీ ఇద్దరూ ఉండి కూడా ఆవిడ అనారోగ్యంతో మంచంలో పడి ఉండి చేసే దిక్కులేక కుమిలి కుమిలి

ఏడ్చింది.'' కవిత ఆమాటలకి మోకాళ్ళలో తలదాచుకుని వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించింది. 'నేను డబ్బు పంపాను కదరా!' చైతన్య అన్నాడు.

'నువ్వు పంపిన వేల రూపాయల్లో ఒక్క రూపాయి కూడా ఆవిడకి సేవ చేసేందుకు మనిషినీ, బాధ పంచుకోవడానికి తోడుని ప్రసాదించలేకపోయింది. ఒక్క రూపాయి కూడా క్షీణించిపోయిన ఆవిడకి ఆరోగ్యాన్ని ఇవ్వలేక పోయింది. వృద్ధుడైన ఆయన, అమ్మతోపాటు అలా కుళ్ళికుళ్ళి ఏడ్చాడు. నేనూ, కావ్యా ఉన్నాం కాబట్టి కొంతన్నా ఆవిడకి సేవ చేయగలిగాం. ఆవిడ నాకందించిన ఆప్యాయతానురాగాలకు కృతజ్ఞతగా నీ ఆబ్సెన్స్‌లో-నేను ఆవిడకి సేవ చేయడం నా బాధ్యతగా భావించాను. ఆ బాధ్యత నా మేరకు నేను సక్రమంగా నెరవేర్చాననే నా విశ్వాసం. ఇక మిగిలింది నీ బాధ్యత - కనీసం ఈ సంగతి ఇప్పటికైనా గుర్తించు''. చివరి వాక్యాన్ని కొంచెం కటువుగా పలికాడు మధు.

''మధూ! నువ్వు చెప్పేదంతా నిజం కావచ్చు-- కానీ--''

'చైతన్యా!' శ్రీధరమూర్తి ఎప్పుడు వచ్చాడో ఆవేశంగా కొంచెం గట్టిగా పిల్చాడు. అతణ్ణి చూసి మధు లేచాడు. 'కూర్చో మధూ-' అతణ్ణి వారించి ఆయనా ఓ సోఫాలో కూర్చున్నాడు.

'చైతన్యా! తద్దినాలు, కర్మ కాండలూ ఏదేశంలోనూ లేకపోవచ్చు. కానీ నువ్వు చూసిన దేశాల్లో, పరిశీలించిన సంస్కృతుల్లో తల్లి, తండ్రి, చెల్లి, పోనీ ఎవరో బంధువైనా చనిపోతే ఏ చెత్త కుప్పలోనో - కాలువలోనే విసిరేయడం చూశావా?' 'నాన్నా!' చైతన్య ఏదో చెప్పబోయాడు. 'కొందరు ఎలక్ట్రికల్ క్రిమేషన్ చేస్తారు. ఇంకా కొందరు మమ్మీలలో భద్రపరుస్తారని విన్నాను. ఇలా ఎవరి సంస్కృతి, సంప్రదాయాల్ని అనుసరించి వారు అమలు పరుస్తారు. అంతా అయాక వారివారి దైవాలముందు ప్రార్థన చేస్తారు. ఎందుకో తెలుసా! చనిపోయిన వారి ఆత్మ శాంతించాలని. ఎవరిమతానుసారం వారు సంప్రదాయాలను పాటిస్తున్నప్పుడు హిందుమతం మాత్రం ఇవి మూఢనమ్మకాలని త్రోసివేయడం సముచితంగా ఉందా? మనమూ అంతేరా, ఈ సంస్కృతి, సంప్రదాయం ఎవరికాలాన్ని డబ్బుని దుర్వినియోగం చేయడానికి ఉద్దేశింపబడలేదు. మనిషికీ, మనిషికీ ఉన్న అనుబంధానికి

గుర్తుగా, మానవ సంబంధాలకి సాక్ష్యంగా కొన్ని పద్ధతులను ఆచరించమన్నారు. పోనీరా - నీకు నమ్మకం లేకపోతే నీ సమయాన్ని వృధాచేయకు. నా భార్య ఓ అనాథలా మరణించిందన్న బాధ నాకు లేకుండా పెంచిన మమకారానికి కృతజ్ఞతగా ఈ మధు దానికి తలకొరివి పెట్టి మా మనసులకి శాంతి ఇచ్చాడు. వీడే మిగతా కార్యక్రమాలు పూర్తి చేస్తాడు.''

చైతన్య బాధగా అన్నాడు. ''క్షమించునాన్నా! నా సమయం వృధా అవుతుందని కాదు, ఇలాంటివన్నే సెంటిమెంట్స్ అని...''

''సెంటిమెంట్స్... భారతదేశమే సెంటిమెంట్స్ దేశంరా, ఈ సెంటిమెంట్స్ ఉండబట్టే నేను ఆవిణ్ణి ఎంత నిర్లక్ష్యం చేసినా, ఎంతగా తిట్టినా అన్నీ సహనంతో భరించి నాకు ఈనాటికి నాదంటూ ఓ ఇంటినీ, జీవితాన్ని ఇచ్చింది. ఈ సెంటిమెంట్స్‌తోటే తన కడుపు మాడ్చుకుని, తనకోరికల్ని చంపుకుని నిన్నూ, నీచెల్లెల్ని కడుపులో పెట్టుకుని కాపాడింది. నిన్ను ఇంజనీర్‌ని చేసింది. నీ చెల్లెలికి అందమైన భవిష్యత్తు ఇచ్చింది. ఈ సెంటిమెంట్స్‌తోటే అనాధగా తన పంచన చేరిన మధుని కన్నకొడుకుగా ఆదరించి విద్యావంతుణ్ణి చేసింది-- ఈ సెంటిమెంట్స్‌తోటే నువ్వు ఆవిణ్ణి వృధ్ధాప్యంలో వదిలేసి దూరదేశానికి వెళ్తుంటే, గుండెలో జలపాతాలను దాచుకుని చిరునవ్వుతో సాగనంపింది. చైతన్యా! నేను తండ్రిగా సంపాదించి, మీ పోషణార్థం అంటూ ఆవిడచేతిలో పెట్టిన డబ్బుల్తో ఆవిడ తన సుఖాన్ని కొనుక్కొని ఉంటే ఈనాడు నువ్విలా నిలబడి ఉండేవాడివి కాదురా! నీ ఉన్నతి ఆవిడ త్యాగం చేసిన సుఖాల్లో ఉందిరా! అలాంటి త్యాగం ఆవిడ చేయడానికి భారతదేశంలో, సెంటిమెంట్స్ ఆధారంగా నిలబడిన ఈ దేశంలో స్త్రీగా పుట్టడమే!' ఆయన కంఠం వణికింది.

మధు కంగారుగా అన్నాడు 'బాబాయి ఆవేశపడద్దు' ఆయన పేలవంగా నవ్వాడు. 'భయపడకు మధూ! నాకేం అవదు. నేను శిలని, అందుకే ఈ ప్రాణానికి ప్రాణం అయి తన ఆయుష్షు కూడా నాకు పోసి, నా దమయంతి వెళ్ళిపోయినా ఇంకా బ్రతికి ఉన్నాను.'

కవిత ఏడుస్తూనే ఉంది కుమిలి కుమిలి. లోపలినుంచి కావ్య వెక్కిళ్ళు వినిపిస్తున్నాయి. శ్రీధరమూర్తి మళ్ళీ అన్నాడు. 'చెతన్యా! మూఢాచారాలు వేరు, అవి పాటించమని నిన్ను నేను అడగడంలేదు. సెంటిమెంట్స్ వేరు, మూఢనమ్మకాలు వేరు. నువ్వు ఈ మూడు రోజులు జరపవలసిన తతంగం జరపనంతమాత్రాన మీ అమ్మకి సద్గతులు ప్రాప్తించవనీ, ఆత్మ శాంతించదనీ నేను భయపడడం లేదు. ఈ ఇంటితో, మనందరితో శాశ్వతంగా రుణం తీర్చుకుని, అనుబంధాలు తెంచుకుని వెళ్ళిపోయిన ఆ దేవతకి ఆఖరి వీడ్కోలు ఘనంగా ఇవ్వమని వేడుకుంటున్నాను. అర్థం లేనివో ! అర్థం ఉన్నవో, మన శాస్త్రాలు ఈ ఆచారాలన్నీ కన్న కొడుకే చేయాలని శాసిస్తున్నాయి. ఆ శాసనాన్ని ధిక్కరించగల శక్తి నాకిప్పుడులేదు. అందుకే నిన్ను ప్రాధేయపడుతున్నాను.' ఆయన కంఠం వణికింది. తూలుతూ లేచి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

మధు, కవితకూడా చేతుల్లో మొహం దాచుకుని అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు. విసురుగా వీచిన గాలికి ఎండిపోయిన కొబ్బరి మట్ట ఒకటి క్రింద పడినట్లుగా తప్‌మని శబ్దం అయింది. లోపలినుంచి చిన్నారి మలయ లేత స్వరం వినిపిస్తోంది. 'ఇండియా ఈజ్ మై కంట్రి - ఐ లవ్ మై కంట్రీ' అప్పుడు రాలిందో కన్నీటి చుక్క చైతన్య కళ్ళనుంచి.

ఆంధ్రప్రభ దినపత్రిక
మహిళ అనుబంధం